RAVIRAJ LENDING LIBRARY
USMAN ROAD, MADRAS-600 017.

కథా నిలయం
3887
శ్రీకాకుళం

# గెజిటెడ్ ఆఫీసరు భార్య

ఆవీధి మొత్తానికే అలంకారంగా నిలిచే ఇల్లు ఒక్కటే! - అదే నీలి రంగు డాబా! 'బ్లూహౌస్' అంటారు. ఆపేరు చెబితే ఆ టవున్లో రిక్షా ఎక్కడ ఎక్కినా - నేరుగా అక్కడికే తీసికెళ్ళ బడుతుంది.

మెయిన్ రోడ్డు మూడు భాగాలుగా చీలిన ప్రదేశంలో, మొదటి రోడ్డు మొగదల్లో మూడు పదుల గజాల దూరాన ఉంది 'ఆబ్లూహౌస్'. అయిదుగురేసి పిల్లలుగల రెండు కుటుంబాలవారు నిశ్చింతగా నివసించగల ఆ పెద్దడాబా చుట్టూ మూడడుగులఎత్తు ప్రహరిఉంది! ఆ ప్రహరీకి దిగువున చుట్టూ గార్డెన్. విశేషమేమిటంటే - సిమ్మెంటురాళ్ళతో నిర్మించబడ్డ ప్రహరీ గోడలకూ, డాబాకూ నీలిరంగు వేయబడ్డట్టే ఆ గార్డెన్లో పూల మొక్కలన్నీ నీలిరంగు పూలు పూచేవి! ఉదయ కాంతిలో, మధ్యాహ్నపు తెల్లని ఎండలో, సాయంత్రపు సూర్యుని మెత్తని వెలుగులో, రాత్రిపూట వెన్నెల్లో ఆ నీలిరంగు డాబా వింత సోయగంతో మహా సొంపుగా ఉంటుంది.

పదేళ్ళ క్రితం ఆ డాబా యజమాని వ్యాపారరీత్యా హైద్రాబాద్ వెళ్ళి, అక్కడే స్థిరపడి పోయాడు. అప్పట్నుంచీ ఆ ఇంట్లో ఎవరో ఒకరు గెజిటెడ్ ఆఫీసర్ వుంటూ వస్తున్నాడు. కొన్నేళ్ళు గవర్న మెంటు డాక్టరూ, మరికొన్నాళ్ళు పి. డబ్ల్యు. డి. ఎగ్జిక్యూటివ్ ఇంజి

నీరూ, ఆతర్వాత కమర్షియల్ టాక్స్ ఆఫీసరూ, ఈ కథా కాలానికి కూడా ఒక గెజిటెడ్ ఆఫీసర్ ఉంటున్నాడు.

కాని ఆ ఆఫీసరు జాతీయ పొదుపు ఉద్యమం పట్ల అత్యంత భక్తి శ్రద్ధలు గలవాడు కావటం చేతనూ, ఆయన భార్య సౌభాగ్యమ్మ రాగి పైసాను వెండిరూపాయిగా దైనందిన జీవితంలో ఆరాధించేది కావటం వల్లనూ - ఒక్క డజను పడక మంచాలు సరిపడే హాస్పటల్‌లా వున్న ఇంత ఇంటినీ ఆయిదుగురు పిల్లలుగల తమ కుటుంబం ఏంచేసుకో గలదని భావించి, 'బ్లూహౌస్'ను రెండు పోర్షన్లుగా విడగొట్టి ఒక భాగంలో చేరారు. ఆడాబా యజమానికి నెలనెలా అద్దె వసూలుచేసి, మనీయార్డరు ద్వారా పంపించే వేలువిడిచిన మేనమామ కొడుకు బావమర్ది రెండు పోర్షన్లు చేయడంద్వారా ఇరవై రూపాయల అద్దె ఎక్కువరాగా "సరే" అన్నాడు.

ఒక పోర్షనులో ఆఫీసరుగారు చేరి, కుదుట పడ్డాక రెండో పోర్షనులో దాదాపు ఇరవై రోజుల వరకూ ఎవరూవచ్చి చేరలేదు. ఈ లోపల అయిదారుగురు వచ్చి, ఇంటిని చూసి ఉత్సాహంగా పెదవులు తడుపుకున్నారు గానీ - అద్దె అరవై రూపాయలకు అరపైసాకూడా తక్కువ లేదని ఘంట మ్రోగించినట్టు చెప్పగా, ఆవలించి అదేపోవటం జరిగింది.

ఒకరోజు మధ్యాహ్నం సౌభాగ్యమ్మ నిద్రలేచి, మంచంమీద నే రెండు వందలకు రెండేపౌన్లు తక్కువగాగల శరీరాన్ని ఫెటఫెట విరుచుకుంటూండగా - ప్రక్క పోర్షనులో సందడి చెవిని బడింది. ఆమె చివుక్కున మంచంమీదనుంచి క్రిందకు దూకి, అద్దాల కిటికీ తెరిచి చూసింది, వరండాలో ఓ పాతికేళ్ళ స్త్రీ, అంతకు పదేళ్ళ ముదురు వయస్సుగా కనిపించే ఓ పురుషుడూ నిలబడ్డారు. వీధిలో ఆగివున్న లారీలోంచి ఇద్దరు కూలీలు సామాను ఇంట్లోకి చేరవేస్తున్నారు. రెండు ర్యాలీస్ ఫ్యానులూ, ఒక రోజ్‌వుడ్ డ్రస్సింగ్ టేబులూ, గాద్రేజ్ బీరువా, ఫిలిప్స్ మేజరు రేడియో, సోఫాసెట్టు, కోటు స్టాండు, రెండు పెద్ద తోలు పెట్టెలూ, ఒక గ్రామఫోనూ, డబుల్‌బెడ్ స్ప్రింగ్ కాట్, డన్‌లప్ పరుపులూ, దిళ్ళూ, ఉషా సూయింగ్ మెషీను, పుస్తకాల షెల్ఫూ, ఫ్రిజి

డేరూ ఆ సామాన్లుచూసి, "ఎవరో పెద్ద ఆఫీసర్ ప్రక్క పోర్షనులో దిగాడు అనుకుంది సౌభాగ్యమ్మ. ఆమె పది నిముషాలపాటు అల్లాగే కిటికీ దగ్గర నిలబడి కనురెప్ప లార్పకుండా చూసింది. అంతలో ఏడాదిన్నర పిల్లవాడు ఉయ్యాల్లో కెవ్వుమనగా, విసుక్కుని, విసురుగా వాడి దగ్గర కెళ్ళింది సముదాయించేందుకు.

కాని సౌభాగ్యమ్మ మనసూ, ఆలోచనలూ ప్రక్క పోర్షనులోకి క్రొత్తగా దిగుతోన్న వారిపైనే గొడుగు పట్టాయి. పిల్లవాణ్ణి భుజంపైన పడుకోబెట్టుకొని, కుడిచేత్తో జోకొడుతూ మళ్ళీ కిటికీ దగ్గరే నిలబడింది. వాళ్ళకి ఇద్దరు పిల్లలుకూడా ఉన్నట్టున్నారు. ఆరేళ్ళ పిల్లవాడూ, మూడేళ్ళ పిల్లా తల్లిదగ్గరే నిలబడి, కొత్త ఇంటిని కొత్తకొత్తగా చూస్తున్నారు. తల్లిదండ్రుల నాగరీకతకు పిల్లలే ప్రతిబింబాలన్నట్టు - ఆ పిల్ల సాధనా టైపు హెయిర్ కట్ తో, టెర్రికాట్ రెడీమేడ్ గౌనులో, మెడలో వ్రేళ్ళాడే లాకెట్ తో, కాళ్ళకు బూట్లూ, మేజోళ్ళతో, నాజూకూ నాగరీకతా మొహంలో పొలుగారుతుండగా; ఆ పిల్లవాడు టెర్లిన్ రెడీమేడ్ దుస్తుల్లో, దేవానంద్ స్టయిలు హెయిర్ డ్రసింగ్ లో, బూటువేసుకొని, మొహంలో పట్నవాసపు ఠీవి పైకుబుకు తుండగా ఉన్నారు. ఆ పిల్ల చేతుల్లో ఖరీదైన ఆటబొమ్మ ఉంది. ఆ పిల్లవాడి చేతుల్లో రంగు రంగుల ఆర్గాన్ ఉంది. ఇద్దరూ నీరెండలాంటి ఉత్సాహంతో ఉషారుగా ఉన్నారు. ఆ భార్యా భర్త లిరువురూ ఇంట్లో సామాన్లు సర్దిస్తున్నారు.

ఆమె ఎండకన్నెరుగని తెల్లగులాబీ పువ్వులాగా ఉంది. పాలమీగడ తెలుపు జార్జెట్ నైలాను చీర ధరించి, అదేకలర్ వెండిజరీ బోర్డరుగల "హీఫ్ నే" మెగోస్లీవ్స్ పట్టుజాకెట్టు వేసుకుంది. ముత్యాల పోగులూ, ముత్యాల నెక్లెసూ, ముత్యాల గాజులూ, ముత్యాల ఉంగరమూ, ముత్యాల సెట్ తో ఆమె మరీ మనోహరంగా ఉంది. మానుకాయ రంగు టెర్లిన్ ప్యాంటుపై "వీనార్" స్లాకు వేసుకొని, అతను ఆఫీసరు హోదాను బోర్డుకట్టి బయట ప్రపంచానికి చెప్పక చెబుతూన్నట్టుగానే ఉన్నాడు.

ఆ దంపతులు ఎంతో ముచ్చటగా వున్నారు- ఒకే కాడలో పూచిన జంటపువ్వుల్లా, వాళ్ళ సంసార జీవితం ఎంత సుఖమయమో, ఆదర్శ

పూరితమో, ఆనంద దాయకమో వాళ్ళ మొహాల్లోని తేజస్సూ నిర్మలత్వమూ సాక్ష్యంగా తమ ఉనికిని తెలియ చేస్తున్నాయి. "మంచి పొరుగే లభిస్తుంది. ఆమెతో తను త్వరగా పరిచయం చేసికోవాలి!" అనుకుంది సౌభాగ్యమ్మ ఇంకా అద్దాల కిటికీ వద్దే అరటి బోదెవలె నిలబడి.

కాని ఆమెకంటే ముందుగా రెండో కొడుకు శంకరమే ప్రక్క పోర్షను వాళ్ళతో చేయికలిపి వచ్చాడు. వాళ్ళబ్బాయి సహజమైన ఆప్యాయతతో మరునాడు సాయంత్రం మాత్ ఆర్గాన్‌తో ఆహ్వానించగా, బిక్కబిక్కమంటూ వెళ్ళి; ఆ అబ్బాయి తల్లి యిచ్చిన బిస్కట్లతో, చాక్లెట్లతో - మురికైన చొక్కాను విడిచేసినట్టు బిడియాన్ని విడిచేసి, అరగంటసేపు ఆడుకొని, అంతులేని ఆనందంతో ఇవతలకొచ్చి, వాళ్ళ గొప్పను తల్లితో కోటప్ప కొండెక్కినంత సంతోషంగా చెప్పాడు.

"అమ్మా! వాళ్ళ ఇల్లు ఎంత బావుందనుకున్నావ్? సినిమాల్లో స్వర్గలోకంలా ఉందనుకో! అబ్బో! ఆ సోఫాలు, బీరువాలు, రేడియో, గ్రామఫోనూ... వాళ్ళ పిల్లలకు ఎన్నిరకాల బొమ్మలున్నాయనుకున్నావ్! బోలెడున్నాయ్. వాళ్ళమ్మ ఎంతో మంచిది. నాకు ఇన్ని బిస్కెట్లూ, చాక్లెట్లూ పెట్టింది. రోజూ ఆడుకోటానికి రమ్మన్నది. బ్రిటానియా క్రీం బిస్కెట్లూ, ప్యారీ కంపెనీ చాక్లెట్లూ తీసి చూపెట్టాడు శంకరం.

"ఛీ వెధవా! మనహోదాకు పరాయివాళ్ళు ఏమైనా పెడితే తీసుకోవచ్చా? ఆ మాత్రం బుద్ధి ఎట్లా లేకపోయిందిరా?" సౌభాగ్యమ్మ కసురుకుంది కత్తిదూసినట్టు.

శంకరం అరసోలెడు ఆముదం త్రాగిన మొహం పెట్టాడు.

కాని వాడు మళ్ళీ మరునాడు సాయంత్రమే వాసనపట్టిన జీవిలాగే ప్రక్కపోర్షనులోజొరబడ్డాడు.

ముందు వరండాలోను వీధివాకిలివద్ద, గార్డెన్‌లోను, పెరటిలోనూ మూడురోజులనాడు ప్రక్క పోర్షనులో చేరిన ఆమెకేసి సౌభాగ్యమ్మ చూస్తూనే ఉంది. ఒకపూట కట్టినచీరె మరోపూట వంటిమీద లేకుండా ఆమూడు రోజుల్లోనూ ఆమె కట్టుకున్న ఆరు చీరలు చూసి సౌభాగ్యమ్మ

గుండె దీర్ఘంగా ఆవులించింది. ప్రతిచీర అరవై రూపాయలకు తక్కువ విలువ లేనిది. కేతాన్ పట్టు, టెర్రికాట్, జార్జట్ నైలాన్ మీద ఎంబ్రాయిడరీ, కంచిపట్టు, వెంకటగిరి, ధర్మవరం - ఆ చీరలపై మ్యాచ్ అయ్యే జాకెట్లూ, చెప్పులు, నగలు, ఆమెకు రాళ్ళసెట్టూ, ముత్యాల సెట్టూ, మామూలు సెట్టూ - బంగారు ఆభరాణాలున్నాయి. కట్టూ బొట్టూలో దశాబ్దం ముందుకెళ్ళినట్లుగా ఉంది. ఆమె చేసే ఖర్చూ, పోయే పోకడలు, మాటల తీరూ ఆమె భర్త నెలకు ఏ పదిహేను వందల రూపాయలు సంపాదించే ఉద్యోగస్థుడో అనుకుంది సౌభాగ్యమ్మ. ఆమెతో సత్వర పరిచయానికి ఉబలాట పడిందిగానీ - ఆ నేర్పూ, చొరవా లేని మనిషి కావడంతోనూ, హోదా ఉన్నప్పటికీ ఆమెతో పోల్చి చూడతగ్గ బ్రతుకు బ్రతక్కపోవడం వల్ల ఏర్పడ్డ న్యూనతాభావంతోనూ సౌభాగ్యమ్మ పూర్తిగా జంకింది. ఆమె పరిచయానికి ప్రథమ సోపానంగా రెండుసార్లు దొడ్లోనూ, వరండాలో కొంచెం దూరంగా తటస్థపడ్డప్పుడు దోరగా చిరునవ్వును దొర్లించడం జరిగింది గానీ - అది స్వీకరించడానికి సౌభాగ్యమ్మకే దమ్ము చాలలేదు. ఆమె భర్త ఇంట్లో తరచూ పిలుస్తూండటంవల్ల ఆమె పేరు "మనోరమ" అని గ్రహించింది.

ఒకరోజు మధ్యాహ్నం నిద్ర బట్టక మంచంమీద సౌభాగ్యమ్మ దొర్లాడుతుండగా, ప్రక్క పోర్షనులోంచి గ్రాంఫోను పాటలు వీనుల విందుగా వినవచ్చాయి. ఆమె రెండు చెవులూ నిక్కబొడుచుకున్నాయి. పాటలంటే అంత ఇష్టం. కొత్త కొత్త సినిమాపాటలు వింటూనే ఆలోచనా సాగరంలో దిగింది. జీవితమంటే చిత్రకారుడు ఊహాలోకంలో తేలిపోయి, తన కళా ప్రావీణ్యతను కాన్వాస్ గుడ్డపై కళ్ళకు కట్టినట్లు చిత్రించడంకాదు; బాగా దప్పిక గొన్నవాడు ద్రాక్షకుండలోని చల్లని పానీయాన్ని సేవించినట్లు అనుభవించాలి. గొప్ప ఉద్యోగమూ, బ్యాంకులో వేలకొలదీ కూడబెట్టటమూ, పొదుపుకోసం హింసకు గురికావడమూ రిటైర్ అయ్యాక హాయిగా అనుభవిద్దామనే భ్రమను పెంచుకోవడమూ, ఇదికాదు జీ:తం; అనుభవం ముందు తరాలవారి శ్రేయస్సు దృష్ట్యా కోర్కెల్ని ఖైదుచేసి నిముషం గడిస్తే మళ్ళీ తిరిగిరాని అమూల్యకాలాన్ని వృథాపుచ్చుతూ నికృష్టంగా బ్రతకడం కేవలం అవివేకమే! ఆయనగారి

ఉద్యోగపు హోదాకూ, సంపాదనకూ - బ్రతికే బ్రతుక్కూ ఎక్కడా సామ్యమే లేదు. ఇంత తక్కువగా బ్రతకాల్సిన అగత్యమేముంది? తను మంచి చీరెలు ధరించరాదా? నగలు చేయించుకో కూడదూ? గ్రాంఫోను, సోఫా సెట్టూ, ఫర్నిచరూ, గ్యాస్ స్టవ్వూ, గాడ్రేజ్ అద్దాల బీరువా కొనుక్కోరాదూ! పిల్లలకి మంచి మంచి దుస్తులు, తిండీ, కావాల్సిన బొమ్మలు ఎందుకు ఇవ్వకూడదూ? ఏమిటో ......

ఆ రోజు సాయంత్రం సౌభాగ్యమ్మ మనస్సుపై తేనెజల్లు పడ్డట్లయింది. ఊహకందని ఒక విషయం తారుమారైంది. ప్రక్క పోర్షనులో పనిమనిషిగా వుంటూన్న నర్సయ్యను ఆమె యథాలాపంగా అడిగి చూసింది.

"మీ అయ్యగారి ఉద్యోగమేమిటి?"

"అదేదో, ఆఫీసులో గుమస్తాఅండీ!"

సౌభాగ్యమ్మ మనస్సు ఒక్కసారి పిల్లిమొగ్గ వేసి, నేత్రాలు గుండ్రంగా తిరిగి, పెదవులు బిగుసుకుపోయి, గుండె కడబట్టి నంత పనైంది. ఎంత చల్లని కబురు! కాని ఎందుకో ఆమెకు నమ్మశక్యంగా కనబడలేదు. ఒక గుమస్తాభార్య అంత హైలా పచ్చీసుగా జీవితాన్ని అనుభవించడమా! ఆక్షణంనుంచీ ఆమె ఊపిరాడకుండా ఆలోచిస్తూనే ఉంది. భర్త ఆఫీసు నుంచి రాగానే శుభవార్తలాగా ఆయన చెవిన వేసింది. ఆయన కనుబొమ్మల్లో కించిత్ కూడా ఆశ్చర్యం చోటు చేసుకోలేదు. అదేమంత విడ్డూరం అన్నట్టు నిర్లిప్తతగా నవ్వాడు. సౌభాగ్యమ్మ గొంతులో ఇరుక్కున్న పచ్చి వెలక్కాయ పదిపాళ్ల బరువెక్కింది. ఛీ, ఆయన ఎప్పుడూ ఇంతే! నిమ్మకు నీరెత్తినట్లుగా వుంటారు.

మరునాడు సాయంత్రం మనోరమ ఆమె ఇంటికి వచ్చింది. వంట గదిలో మండిగం ప్రక్కన నేలమీద కూర్చుని బియ్యంలో తెల్లరాళ్లు ఏరి వేస్తూన్న సౌభాగ్యమ్మ త్రుళ్ళిపడి, చేటను తలుపుచాటుకునెట్టి, పైట చెంగుతో మొహం తుడుచుకొని, పాండ్స్ స్నో పులుముకున్నట్టుగా నవ్వును తెచ్చి పెట్టుకొని, "రండి! రండి!" అంటూ ఆహ్వానించింది.

మనోరమ ప్రేంకుర్చీలో కూర్చుంది. సిమ్మెంట్ కలర్ మీద వెండి జరీగల బెనారస్ పట్టుచీర ధరించింది. దానిమీదకు సరిపడా జాకెట్టు వేసుకుంది. మెళ్లో లాకెట్ మోడల్ నెక్లెసు, చెంపస్వరాలు, మేలిమి బంగారంమీద సాయంత్రపు ఎండపడి మెరుస్తున్నట్టుగా అందంతో, ఆక క్షణంలో మెరిసి పోతుంది. ఇరువురు పిల్లల తల్లికికూడా అన్ని అందాలు - అలంకరణాలు ఎందుకో అనుకుంది సౌభాగ్యమ్మ మనస్సులో కన్ను ఎరుపు జేసుకుంటూ.

"అక్కయ్యగారూ! మిమ్మల్ని ఒక శుభకార్యానికి ఆహ్వానించడానికి వచ్చాను. రేపు మా అమ్మాయి క్రిష్ణప్రియ బర్త్ డే. పార్టీ సాయంత్రం అయిదు గంటలకు ఏర్పాటు చేశాను. మీరు తప్పకుండా రావాలి. ఊళ్ళో చాలమంది ఆఫీసర్ల భార్యలు వస్తారు. భారీ ఎత్తున జరుగుతుంది. మీరుతప్పకుండా వస్తారు గదూ!" అన్నది మనోరమ ఆహ్వానంలోని ఆప్యాయతను చిరునవ్వు ద్వారా కనబరుస్తూ.

"ఆఁ! తప్పకుండాను." అన్నది సౌభాగ్యమ్మ కనుబొమ్మ లెగుర వేస్తూ

అంతలో ఒక కారువచ్చి వీధివాకిలిముందు ఆగిన చప్పుడయింది.

మనోరమ కుర్చీలోంచి లేచింది.

"వస్తాను అక్కయ్యగారూ! గవర్నమెంటు డాక్టరుగారింటికీ, జడ్జీగారింటికీ, ఇన్కంటాక్స్ ఆఫీసరుగారింటికీ, మునిసిపల్ ఛైయిర్మన్ గారింటికీ వెళ్ళిరావాలి. త్వరగా తీరిగ్గా కలుసుకుందాం" అంటూ చేతులెత్తి నమస్కారం పెట్టి, విసవిస నడిచి కారుదగ్గరకు వెళ్ళింది.

సౌభాగ్యమ్మకు కనురెప్పలు వాలలేదు. అల్లాగే వెండి తెరమీద అరటిచెట్టు పగిది నిలబడి పోయింది.

ఒక గుమాస్తా భార్య ఎంత దివ్యంగా, హోదాగా, రాజసంగా బ్రతుకుతోంది? పెద్దపెద్ద ఆఫీసర్ల భార్యలతో స్నేహం; కార్లలో తిరగటాలు; వేడుకలూ, వినోదాలు; ఖరీదైన చీరలు నగలు ధరించడం, అంతస్తుకు మించిన ఖర్చులు, సరదాలు, మాటలు! తను గెజిటెడ్ ఆఫీసరుభార్య. జీవితాన్ని అట్లా అరచేతిలో వైకుంఠంలా యెందుకు చేసికో

లేకపోతుంది? వాళ్ళ ఆయన గుమాస్తా అయినప్పటికీ ఎక్కువగా సంపాదిస్తున్నాడా? సంఘంలో హోదాను పెంచుకుంటూ, అందరి మనస్సుల్ని ఆకట్టుకొంటూ బ్రతుకుతున్నాడా? అదెలా సాధ్యం ?

మరునాడు సాయంత్రం నాలుగు గంటలనుంచీ మనోరమ ఇల్లు మనోహరంగా, కళకళలాడుతూ, నిండైన సందడితో ఉంది. రంగురంగుల చీరెలతో ఆరు రేకుల పువ్వుల్లాంటి ఆడవాళ్ళు కారుల్లో, రిక్షాల్లో ఒక్కరొక్కరే దిగుతున్నారు. ప్రతివాళ్ళ చేతుల్లోనూ ఏవేవో ప్యాకెట్లు ఉన్నాయి. పుట్టినరోజు పండుగ బహుమానాలు కామోసు!

సౌభాగ్యమ్మ నాలుగు గంటలనుండి ఇంట్లో కిటికీ దగ్గర నిలబడి వీధి వాకిలివేపు అదేపనిగా చూస్తూవుంది. ఆ మనుష్యులు, ఆ హంగామా, హడావుడీ, నవ్వులు, మనోరమ ఆహ్వానమూ, ఆమె చేసిన ఆడంబరపు ఏర్పాట్లూ - ఎందుకో సౌభాగ్యమ్మ మనస్సుపై నీలి తెరల్ని దించాయి. ఒక గుమాస్తా భార్య వేడుక చేస్తే-ఇంతమంది ఆఫీసర్ల భార్యలు స్థానిక ప్రముఖుల సతీమణులు రావాలా? ఎంతవిడ్డూరం? ఈ టవున్‌లో ఆమె ఇంతమంది స్నేహాన్ని ఎట్లాఎప్పుడు సంపాదించింది?

సాయంత్రం ఆరున్నర వరకూ సౌభాగ్యమ్మ అలంకరించుకోలేదు. కనీసం సబ్బుతో మొహమైనా కడుక్కోలేదు. అయిదున్నరకు భర్త ఆఫీసునుంచి వచ్చి, ఏదో పనిమీద మళ్ళీ బజారుకెళ్ళాడు. అంతకు ముందే మనోరమ పనిమనిషి చేత- "అందరూ వచ్చారు. మీరుకూడా రావల్సింది" అని కబురు చేసింగి. కాని ఆమె వెళ్ళలేదు. మనస్సెందుకో ఉత్సాహంగా లేదు. ఎవరో తనని అజ్ఞాతంగా అవమానం చేస్తున్నారన్న భావం కడుపులో లుంగలు చుట్టుకుంటూ వ్యాపిస్తోంది. అయినా ప్రక్కవాటాలో పేరంటం జరుగుతూంటే, వెళ్ళకుండా తప్పించుకోనడ మెట్లా? ఇష్టం లేకపోయినా మనిషి పరిసరాల్ని అనుసరించి కొన్ని సాంఘిక మర్యాదల్ని పాటించక తప్పదు. దాదాపు ముచ్చట అయిపోయే టప్పుడు మొహాన్ని సాదాగా కడుక్కొని, ప్రత్యేకంగా ఏ అలంకరణా లేకుండా, మేలురకపు నేతచీరె, లాన్ జాకెట్టు ధరించి, 'బలవంతపు బ్రాహ్మణార్థం' పగిది మనోరమ ఇంటికెళ్ళింది సౌభాగ్యమ్మ.

"అక్కయ్యగారూ! ఇంటి ప్రక్కనుండే - ఇప్పుడా రావడం:" అన్నది మనోరమ కొంచెంగా ఎత్తిపొడుస్తూ.

"ఏదండీ! పిల్లలతో తీరి చస్తేనా?" అన్నది సౌభాగ్యమ్మ, గంపెడు పిల్లలుగల తల్లికి ఇట్లాంటి సమయాల్లో గల ఆయుధాన్ని నిరాటంకంగా ఉపయోగిస్తూ.

హాలంతా రంగు కాయితాలతో, విద్యుద్దీపాలతో, రబ్బరు బెలూన్లతో బ్రహ్మాండంగా అలంకరించబడింది; మధ్యలో చిన్న కుర్చీ వేసి క్రిష్ణప్రియను కూర్చోబెట్టారు. ముందున్న టేబుల్ పైన ఆహూతులు ఇచ్చిన బహుమానాల ప్యాకెట్లు గజం ఎత్తున పేర్చబడి ఉన్నాయి.

సౌభాగ్యమ్మ బహుమానంగా రిబ్బను ముక్క కూడా తీసుకెళ్ళలేదు. అందు కామె గాలికి పైటచెంగు కదిలినట్లు కూడా 'ఫీల్' కాలేదు. వచ్చిన వాళ్ళకు హాలునిండా సోఫాలు, ప్రేంకుర్చీలు వేయబడ్డాయి. సౌభాగ్యమ్మ తలుపుచెక్క ప్రక్కనున్న మామూలుకుర్చీలోనే కూర్చుంది. "అదేమిటండీ! అక్కయ్యగారూ! ... "అంటూ మనోరమ బుగ్గలు సన్నగిలేట్టు వాపోయినా, సౌభాగ్యమ్మ సోఫాలో ససేమిరా కూర్చోలేదు. క్రిష్ణప్రియను పలుకరించలేదు. ఆ పిల్లకువేసిన దుస్తులు, పెట్టిన నగలు చేసిన అలంకరణా ఆమెను ఆశ్చర్యంలోపెట్టాయి. ఒక ప్లేటులో మూడుస్వీట్లూ, రెండు కారపు సరకులు, ఆపిల్స్, చెక్కెర కేళీ, ఆనబ్ షాహీ ద్రాక్షపండ్లు పెట్టి, ఒక గ్లాసులో బాదంపాలు ఇచ్చింది మనోరమ. ఆ టిఫినూ, డ్రింకూ సౌభాగ్యమ్మకు సహించలేదు. కోడి కెలికినట్లుగా తిని, టెన్ ఇయర్స్ రమ్ను, వాసనచూసి నట్టుగా బాదంపాలను సేవించి - ఇంటికి వెళ్లేందుకు లేచింది. ఒక కిళ్ళీ, ప్లాస్టిక్ బొట్టుపెట్టె, చేతిరుమాలు అందించింది మనోరమ. అవన్నీ ఆమె కూతురు జన్మదినోత్సవపు చిహ్నాలు కామోసు. ఊపిరి సల్పుకో వీల్లేని చీకటి గదిలోంచి వొంటిమీద పురుగులు ప్రాకుతూన్నట్లుగా బయట పడింది సౌభాగ్యమ్మ 'థ్యాంక్స్' అయినా చెప్పకుండా.

మనోరమ కూతురు క్రిష్ణప్రియ జన్మదినోత్సవం జరిగిన వారం రోజుల పిమ్మట ఓరోజు మధ్యాహ్నం ఏమీ తోచక ఆమె సౌభాగ్యమ్మ

ఇంటికి వచ్చింది. సౌభాగ్యమ్మ మర్యాదగానే ఆహ్వానించి. ఆమెను కూర్చుండ బెట్టింది.

"అక్కయ్యగారూ! వారు ఆఫీసుకు వెళ్ళాక నాకు ఇంట్లో క్షణం పాటు తోచదు. రోజూ ఎవరో ఒకరింటికి వెళ్ళి కబుర్లతో కాలక్షేపం చేయడం అలవాటు." అన్నది మనోరమ.

"దానిదేముంది లెండి! నాబోటి పిల్లల తల్లులకు తీరుబాటు ఉండదు గానీ, ఒకళ్ళిద్దరు పిల్లలతో సరిపెట్టుకొని సంసారాన్ని క్లుప్తం చేసుకున్న వాళ్ళు ఎన్ని షికార్లయినా చేయవచ్చు; ఎంత కాలక్షేపంగానైనా బ్రతకొచ్చు" అన్నది, సౌభాగ్యమ్మ పుల్ల విరిచి పొయ్యిలో పెట్టినట్లు.

"అక్కయ్యగారూ! నాకు తెలీక అడుగుతానుగానీ - ప్రభుత్వమూ ప్రణాళికలు ఏకకంఠంతో కుటుంబ నియంత్రణాన్ని గురించి ఘోష పెడుతూన్న ఈ రోజుల్లో కూడా గంపెడు సంసారంతో సతమతం కావడంలో అర్థంలేదు. మీ రెందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థంకాకుండాఉంది".

"ఆ అదృష్టం అందరికీ వుండొద్దు! ఆయన గారి మతమే మతం. ఆడవాళ్ళమాట చెవిదాకా సోకదు. ఉద్యోగం తప్ప మరో లోకంతో పనిలేదు ఆయనగారికి."

"ఇంటిని గురించి పెద్దగా శ్రద్ధ తీసుకున్నట్లు లేదు. అయనగారి ఉద్యోగానికీ, హోదాకు ఇల్లు ఇట్లా ఖాళీ అగ్గిపెట్టెలా వుంచడం ఏం బావుండలేదు! ఎంతో ఫర్నిచర్ పెట్టుకోవచ్చు, ప్రెజిడేర్, సోఫా సెట్టు, రేడియోగ్రామ్, ఈ రోజుల్లో ఇవిలేని ఇల్లు ఇల్లు కాదు. మావారిది రెండొందల రూపాయల ఉద్యోగమైనా, నేనే బలవంతాన కొనిపించాను. ఉద్యోగపు హోదాతో జీవితానుభవాన్ని గణించలేము. సంపాదించాలి. అనుభవించాలి. ఈ క్షణం గడిస్తే, మరోక్షణంలో ఏమౌతామో ఎట్లా చెప్పగలం? అట్లాంటి కాలంలో జీవితానికి అనుభవాలే మిగులుతాయి. ఏమంటారు అక్కయ్యగారూ!"

అర్ధ సవాసేరు పచ్చిమిరపకాయలు రసం తీసి గొంతులో పోసినట్లయింది. సౌభాగ్యమ్మకు, ఒక గుమాస్తా భార్య తన యింటి

కొచ్చి తన సంసారాన్నీ, ఇంటిని అసహ్యం చేయడమా? కాని సౌభాగ్యమ్మ కోపాన్ని వెళ్ళగక్కలేకపోయింది. నేలచూపులు చూస్తూ కూర్చుంది.

మనోరమ అర్ధగంట వరకూ అదీ ఇదీ వాగుతూనే ఉంది. ఆ వాగుడులో తనని గురించీ, తన ఖర్చులూ, దర్జా కులాసాయైన బ్రతుకును గురించి నాలుకమీద మంచుగడ్డ నానకుండానే చెప్పింది. పైపెచ్చు ఆమెను తన యింటికి రమ్మనమని ఆహ్వానించింది. బెంగుళూరునుంచి తెప్పించిన క్రొత్త చీరెల్నీ, మద్రాసునుంచి తెప్పించిన నగల్నీ, కలకత్తానుంచి తెచ్చిన క్రోకరీనీ చూపెడతానంది. సౌభాగ్యమ్మ నోరు విప్పి వస్తానని చెప్పలేదు. రానని అనలేదు, తల ఆడించి ఊరుకుంది.

అన్ని వసతులు అనువుగా అమరినా సౌభాగ్యమ్మకు ఆ యింట్లో ఏదో లోపించిన బాధ అంత కంతకూ అధికం కాసాగింది. స్వేచ్ఛగా, కడిగిన అద్దంలాంటి మనస్సుతో, నిబ్బరంగా ఉండలేకపోతోంది. ఏదో అశాంతి, ఆత్మలో రగులుతోన్న న్యూనత; బ్రతుకును గురించి చికాకూ; ఈ జన్మకు ఇంతేనా బ్రతుకు? అన్న ప్రశ్నయొక్క వేధింపూ; గాలికి చెదిరిపోయే మబ్బులాంటి ఆలోచనలూ, వెలుగును చూసి చీకటి భయపడుతూన్నట్లు ఏదో భయం!

ఒక రోజు మనోరమ కడియం నుంచి దాదాపు వందరకాల పూల మొక్కలు, క్రోటన్లూ తెప్పించి, ఇంటిముందు ఖాళీస్థలంలోనూ, ఇంటి వెనుక పెరటిలోనూ అందంగా నాటించింది. ఇద్దరు పనిమనుషులకు ప్రొద్దు క్రుంకేవరకూ పని సరిపోయింది. ఆ మొక్కలన్నీ బ్రతికి, రంగు రంగుల పూలుపూస్తే ఎంతో ముచ్చటగాఉంటుంది; ఇంటికే శోభవస్తుంది. ఇంటిలో ఉండేవారి సౌందర్య పిపాసను ప్రకటిస్తుంది. కాని ఆప్రక్క ఇంటి సంగతేమిటి? చెట్లూ చేమా లేక బోసిగొడుతూ ఉండాల్సిందేనా? పచ్చని చెట్లప్రక్కన ఎడారి! ఆ ఇంటి ఇల్లాలుకూ నిండుగా పూల మొక్కల్ని పెట్టుకోవచ్చు; పెంచుకోవచ్చు. సౌభాగ్యమ్మ ముక్కోళ్ళు ఎరుపెక్కగా భర్తతో ఆవిషయమే ప్రస్తావించింది. "మన ఇంటిముందు కూడా ఏ మైనా పూలమొక్కలు పెట్టిద్దామా? దొడ్డి బోసికొడుతూన్నది"

"ఇదేమైనా మన స్వంత ఇల్లా! వందరూపాయలు బెట్టి పూల మొక్కలుకొని అందంగా పెంచడానికి. రేపు ఇంకోఊరు బదిలీయైతే ఇల్లు ఖాళీజేసి, తట్టాబుట్టా వేసుకొని వెళ్ళాలిగదా! శవానికి అలంకారం చేసినట్టు ఈ ఖర్చూ, ఆడంబరమంతా దేనికి?" అన్నాడాయన.

సౌభాగ్యమ్మ నోరునొక్కుకున్నది.

ఎప్పుడూ ఇంతే! ఇల్లాలుమాటకు పిసరంత విలువలేదు. ఏ మాట అన్నా ఏ సలహా చెప్పినా పెడచెవిని బెట్టటమే! తోటకూరకాడలాగా తీసివేయడమే! కొంతమంది ఆడవాళ్ళు భర్తల్ని తాళంచెవుల గుత్తుల్లాగా కొంగున ముడివేసుకుంటారు. అట్లాంటివారు పూర్వజన్మల్లో సుకృతం చేసి కొని వుండి వుంటారు. తనలాంటి వాళ్ళగతి ఇంతే.

రానురాను సౌభాగ్యమ్మకు ఆ ఇంటిలో ప్రొద్దుబోవడం లేదు. ఒంటరి తనంతో విలవిలలాడ జొచ్చింది. స్నేహంకోసం మనోరమ చిందులు త్రొక్కినా, ఆమె మనస్సు కూడిరావడంలేదు. ఒకరోజు మధ్యాహ్నం ఆమెకో ఆలోచన తట్టింది. ఈ ఇల్లు మారితే! కాని భర్త తన ఆలోచ నను ఆదరిస్తాడనే నమ్మకం ఏకోశానా లేదు. అందుకోసం తగిన బలాన్ని చేకూర్చుకొని ఒక ఆదివారం భర్తతో అన్నది సౌభాగ్యమ్మ భయ పడుతూనే.

"ఏమండీ! ఈ ఇల్లు పిల్లల స్కూలుకు చాలా దూరమైంది. వాళ్లు నడవలేక రోజూ ఇదవుతున్నారు. దగ్గర్లో ఏదైనా ఇల్లుతీసుకొని అందు లోకి మారకూడదూ!"

పేపరు చదువుకొంటూన్న ఆమె భర్త కళ్ళు గుండ్రంగా చేసి చూశాడు.

"ఈ మాత్రపు ఇల్లు ఈ టవునులో దొరకుతుందా? నీకేం లక్షు చెబుతావు? పిల్లలు నడవలేకపోతే, రోజూ రిక్షాలు కట్టించి పంపు. అంతేగాని, ఇల్లుమార్చే ప్రసక్తి నా దగ్గర తీసుకురాకు."

సౌభాగ్యమ్మ మరి పెదవులు కదుపలేదు.

ఒక రోజు సాయంకాలం సౌభాగ్యమ్మ వంటగదిలో ఏదో సర్దుతూం డగా, మనోరమ ఇంటినుంచి ఘొల్లుని ఏడ్పు వినవొచ్చింది. సౌభాగ్యమ్మ స్తంభించి పోయింది. ఆమె కేమీ అంతుబట్టలేదు. గబగబా బయటి కొచ్చింది.

బయట ఆఫీసు ప్యూను ఉన్నాడు.

లోపల మనోరమ ఏడుస్తూన్నది.

"ఏమిటి ? ఏం జరిగింది ?" అన్నది సౌభాగ్యమ్మ ఆదుర్దాగా.

ఆఫీసు ప్యూను తలవంచుకొని నిలబడ్డాడు. ఏం మాట్లాడలేదు.

సౌభాగ్యమ్మ లోపలికి వెళ్ళింది. మనోరమ మంచంమీద బోర్లాపడి ఏడుస్తున్నది. ఆమె ఏడ్పుయొక్క స్థాయి హఠాత్తుగా తగ్గింది.

"ఏం జరిగిందండీ ! ఎందుకేడుస్తున్నారు ?" అన్నది సౌభాగ్యమ్మ సానుభూతిగా విషయాన్ని కనుక్కుందామనే ఉద్దేశ్యంతో.

మనోరమ చివుక్కున మంచంమీదనుంచి లేచికూర్చుని - "ఏం లేదు లెండి అక్కయ్యగారూ ! మాకేదో కష్టమొచ్చింది. ఏడ్వక తప్పుతుందా మధ్యలో మీకెందుకు ? ఇది ఒకరు ఆర్చి తీర్చే ఆపదకాదు" అన్నది.

సౌభాగ్యమ్మ మనస్సు చిన్నబోయింది. మళ్ళీ మాట్లాడకుండా వెనక్కు తిరిగి, తన ఇంటిలోకి వచ్చింది.

ఆ రాత్రే ఆమెకు అసలు విషయం తెలియవచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం మనోరమ భర్త ఆఫీసులో వందరూపాయలు లంచం తీసు కొంటూండగా ఆంటి కరెప్షన్ డిపార్టుమెంటువారు పట్టుకున్నారట.

సౌభాగ్యమ్మ నీటికెరటంలాంటి నవ్వు నవ్వుకుంది.

తర్వాత వారం రోజులకే మనోరమ ఇల్లు ఖాళీచేసి సామానంతటినీ నాలుగు లాగుడు బండ్లమీద వేయించుకొని ఎక్కడికో వెళ్ళింది.

"ఏమండీ ! ఆఖాళీయైన పోర్షను కూడా మనమే తీసుకుంటే బావుంటుందేమో !" అన్నది గెజిటెడ్ ఆఫీసరు భార్య సౌభాగ్యమ్మ భర్తతో ఆ మరుసటిరోజు మునిమాపువేళ. (కృష్ణవేణి)

—o—